ఆహ్లాదం, ఆనందం.. ఆమడదూరం

- మైదానాన్ని తలపిస్తున్న సత్యనారాయణపురం రైలు పార్కు
- అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని రైల్వే అధికారులు



సత్యనారాయణపురంలోని రైలు పార్కు



పూర్తిగా దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని సత్యనారాయణ పురం రైల్వే కాలనీ విజయవాడ డివిజన్‌లోనే ఎంతో ప్రఖ్యాతి చెందినది. కాలనీవాసుల ఉపయోగార్థం బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని ఈటీటీసీ పక్కన జూన్ 20, 2015 సంవత్సరంలో అప్పటి దక్షిణ మధ్య రైల్వే జీఎం పీకే శ్రీవత్సవ చేతుల మీదుగా రైల్వే పార్కు ప్రారంభించారు. సకల సదుపాయాలతో పచ్చని చెట్లు, సేద తీరేందుకు సిమెంట్ బల్లలు, పిల్లలు ఆడుకునేందుకు ఆటపరికరాలు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధుల కోసం వాకింగ్ ట్రాక్, విద్యుత్ లైట్ల వెలుగులో రైల్వే పార్కు చక్కటి ఆహ్లాదాన్ని కాలనీవాసులకు అందించేది. అయితే నేడు ఈ రైలు పార్కు కాలనీవాసులకు ఉపయోగపడకపోగా అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. పార్కు ప్రారంభంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం మీద చూస్తే తప్ప ఇది పార్కు అని చెప్పే ఆనవాలు లేవు. ఈ పార్కు నిర్వహణను రైల్వే అధికారులు పూర్తిగా విస్మరించారు.



పచ్చదనం లేక మైదానాన్ని తలపిస్తున్న పార్కు

సదుపాయాలు మచ్చుకైనా కనిపించవు

గతంలో పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పార్కులో వాకింగ్ చేసుకునేవారు. మహిళలు, వృద్ధులు పిల్లలతో ఆహ్లాదభరితంగా సేదతీరేవారు. ప్రస్తుతం పార్కులో ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్, ఎటు చూసినా ఎండిపోయి నేలకొరిగిన వృక్షాలు, మొక్కలతో మైదానాన్ని తలపిస్తోంది. కనీసం కూర్చునేందుకు కూడా సదుపాయాలు లేవు. పిల్లల ఆటపరికరాలైతే మచ్చుకైనా కనిపించవు.

పార్కు నిర్వహణను పక్కన పెట్టేశారు

సకల సదుపాయాలతో పచ్చని చెట్లు, సిమెంట్ బల్లలు, ఆటపరికరాలు, వాకింగ్ ట్రాక్, విద్యుత్ లైట్ల వెలుగులో ఉన్న రైల్వే పార్కు నిర్వహణను క్రమేణా విజయవాడ డివిజన్ అధికారులు పక్కన పెట్టేశారు. దీంతో పార్కు కాస్తా అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలతో పార్కుకు పూర్వవైభవం తీసుకువచ్చి కాలనీవాసులకు ఉపయోగపడేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఆకతాయిలకు అడ్డా

సత్యనారాయణపురంలోని రైల్ పార్కులో అసాంఘిక కార్యక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పార్కులో ఎక్కడ చూసినా తాగిపడేసిన మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. బీఆర్టీఎస్ రోడ్డుకు ఆనుకుని ఉండటంతో ఆకతాయిలు పార్కుకు వచ్చి మద్యం, గంజాయి సేవిస్తూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటు ఆర్పీఎఫ్ గాని, అటు జిల్లా పోలీసులు గాని వీరిపై దృష్టి పెట్టకపోవడంతో వారి ఆకృత్యాలకు అడ్డు, అదుపు లేకుండా పోతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పార్కులో దర్శనమిస్తున్న మద్యం సీసాలు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సాంబశివరావు, రాజా తదితరులు

పటమట(విజయవాడతూర్పు): ప్రభుత్వాలు మారినప్పుడల్లా పారిశుద్ధ్య కార్మికులకు ఇబ్బందులు తప్పటం లేదని, అవుట్ సోర్సింగ్, పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల నిర్వహణ నగరపాలక సంస్థ ద్వారానే చేపట్టాలని ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి బుదె రాజా డిమాండ్ చేశారు. హనుమాన్‌పేట దాసరి భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వీఎంసీలో పని చేస్తున్న ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ, సాంఘిక భద్రత అమలుకు నగరపాలక సంస్థ పూర్తి బాధ్యతలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ కంపెనీ, ఏజెన్సీలకు కార్మికుల నిర్వహణ అప్పగించవద్దని, ఆయా విభాగాల్లో విధులు నిర్వహించే కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు.

దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు..

రెగ్యులర్ కార్మికులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మూడు డీఏలు సత్వరం విడుదల చేయాలన్నారు. జనాభా ప్రాతిపదికన అవుట్ సోర్సింగ్, పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పెంచాలని, కార్మికులందరికీ అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. చనిపోయిన, రిటైర్మెంట్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని, ఇళ్లు లేని కార్మికులకు నగర పరిధిలో ఇళ్లు కేటాయించాలని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జరిగే దశల వారీగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ చలం, గౌరవాధ్యక్షుడు జక్కి జేమ్స్, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి



మాట్లాడుతున్న వీఎంసీ ప్రజారోగ్య విభాగం ముఖ్య అధికారి సురేష్‌బాబు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణ హితమైన వస్తువులను వినియోగించేందుకు ప్రజలను చైతన్య పరచాలని వీఎంసీ ప్రజారోగ్య ఇన్‌చార్జి ప్రధానాధికారి డాక్టర్ సురేష్ బాబు చెప్పారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న సమావేశ హాలులో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై రైతు బజార్, మార్కెట్, హాస్పిటల్స్, హోటల్స్ మేనేజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో వ్యర్థాలు ఎక్కువగా వచ్చే ప్రదేశాలైన రైతు బజార్లు, హాస్పిటల్లో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వల్ల పర్యావరణం నాశనం అవుతుందని, ఆ ప్లాస్టిక్ భూమిలో కలిసేందుకు 200 ఏళ్లు పడుతుందని చెప్పారు. మార్చి 1వ తేదీ నుంచి నగరంలో పకడ్బందీగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక దాడులు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వాడినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, భారీ జరిమానా విధించడంతో పాటు వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నగరంలోని రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్లు, మార్కెట్ మేనేజర్లు, హాస్పిటల్ మేనేజర్లు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

21న చెఫ్ ప్రెన్యూర్స్ చాలెంజ్ పోటీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దినకర్‌రెడ్డి, అమర్‌సుధీర్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21న చెఫ్ ప్రెన్యూర్స్ చాలెంజ్ పోటీని నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి చిట్టూ అమర్‌సుధీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రాంగణంలో ఏపీ ఐసీటీ అకాడమీ అధినేత ఎన్ దినకర్‌రెడ్డి సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అమర్‌సుధీర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో వ్యాపార ప్రేరణను పెంపొందించటం, నూతన ఆలోచనలకు ప్రోత్సాహం అందించటం, వాస్తవ వ్యాపార అనుభవాన్ని పరిచయం చేయటం వంటి ముఖ్య లక్ష్యాలతో ఈ పోటీని నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఆహార తయారీ, మార్కెటింగ్ వ్యూహాలు, సమీక్షలు, ధర నిర్ణయం, లాభనష్టాల గణన వంటి వ్యాపార మూలాలను అర్థం చేసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, విభాగాధిపతి ఎస్.మణికంఠ, కన్వీనర్ ఎస్.ప్రవీణ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలి

నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



64వ డివిజన్‌లో పార్కును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పాయకాపురం(విజయవాడరూరల్)\పటమట(విజయవాడతూర్పు): నగరంలో ప్రతినిత్యం అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, ఎక్కడా వ్యర్థాలు ఉండకూడదని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రభకాలనీ, ప్రకాష్ నగర్, ఎల్బీఎస్ నగర్, ఉడా కాలనీ, కరకట్ట రోడ్, కండ్రిక, నూజివీడు రోడ్డు, వాంబేకాలనీ, తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించి క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని రోడ్లపై వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించాలని, ఇంటింటి వ్యర్థాల సేకరణ కచ్చితంగా జరగాలని సూచించారు. పుష్ కార్ట్‌లో కచ్చితంగా నాలుగు చెత్తబుట్టలను ఉంచాలని, తడి-పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని, నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు.

బైక్‌పై వెళ్లి పరిశీలన

ప్రకాష్ నగర్, ఎల్బీఎస్ నగర్, ఉడా కాలనీ పరిసర ప్రాంతాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపిరాజు ద్విచక్ర వాహనంపై ఎక్కి పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పలు పార్కులను పరిశీలించి కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యర్థాలను రోడ్డుపైన నిలువ ఉంచకుండా, కాలువలో పూడికలను ఎప్పటికప్పుడు తీస్తూ నీటి ప్రవాహంలో ఎటువంటి ఆటకం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో నీటి ప్రవాహం సక్రమంగా పారకపోతే దోమల ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు. దోమలను నియంత్రించడానికి కాలువల్లో పూడికలను తీయడమే కాకుండా మలేరియా సిబ్బంది ప్రతిరోజు ఫాగింగ్, ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, బయాలజిస్ట్ సూర్యకుమార్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జననేతకు పోటెత్తిన అభిమానం










మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విజయవాడ నగరంలో పర్యటించారు. గాంధీనగర్‌లోని జిల్లా జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌ను వైఎస్ జగన్ కలిసి పరామర్శించారు. వైఎస్ జగన్‌ను కలిసేందుకు పార్టీ నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో జైలు పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









క్లుప్తంగా

23న మార్క్సిస్టు ఐక్య సదస్సు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత కమ్యూనిస్టు ఉద్యమం శత వార్షికోత్సవం సందర్భంగా మార్క్సిస్టు ఆలోచనాపరుల బృందం ఆధ్వర్యాన ఈనెల 23వ తేదీన గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ లైబ్రరీలో 'భారత కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనం, ఆవశ్యకత – అవకాశాలు – అవరోధాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్, హక్కుల ఉద్యమ నాయకులు చిగురుపాటి భాస్కరరావు, ఏఎన్‌యూ విశ్రాంత ఆచార్యులు అబ్దుల్ నూర్‌బాషా తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం సదస్సు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సదస్సు నిర్వహణ కమిటీ సభ్యుడు, న్యాయవాది పి. శ్రీనివాస్, సామాజిక కార్యకర్త ఎం.అరుణ కుమార్, రిటైర్డ్ ఇంజినీర్ చంద్రశేఖర్, సీనియర్ జర్నలిస్ట్ జీవీ రంగారెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): వ్యక్తి అదృశ్యమైన ఘటనపై నున్న పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్‌కు చెందిన బియ్యపు రమణ ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య లావుతల్లి, ఒక పాప, బాబు. ఈ నెల మూడవ తేదీన లావుతల్లి బయట పని చేసుకొని ఇంటికి వచ్చి చూడగా భర్త కనిపించలేదు. ఇంట్లో ఉండాల్సిన బంగారు నాంతాడు లేదు. సెల్ ఫోను ఇంట్లోనే వదిలివెళ్లిపోయాడు. అప్పటి నుంచి తన భర్త ఆచూకీ కోసం బంధువుల ఇళ్ల వద్ద విచారణ చేయగా రాలేదని తెలిసింది. దీంతో లావుతల్లి తన భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఇంద్రకీలాద్రిపై ఏఈవోల విధులలో మార్పులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల విధుల్లో మార్పులు చేస్తూ ఆలయ ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. ఆలయ భూములు, లీజెస్, లీగల్, దేవాలయం, ఓవరాల్ ఇన్‌చార్జి, ఫెస్టివల్, పూజల విభాగాల బాధ్యతలు నిర్వహించే ఏఈవో ఎం.దుర్గారావుకు అదనంగా దత్తత దేవాలయాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఏఈవో సుధారాణికి శారీస్, అకౌంట్స్, ఆడిట్ జనరల్, ప్రొవిజన్ స్టోర్స్ బాధ్యతలతో పాటు ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తారు. ఏఈవో జంగం శ్రీనివాసమూర్తికి నిర్వహిస్తున్న బాధ్యతల్లో కొన్నింటిని మినహాయింపు ఇచ్చారు. ప్రస్తుతం పరిపాలనా విభాగం, మెయిన్ టెంపుల్, సబ్ టెంపుల్స్, ట్రస్ట్ బోర్డు, కనకదుర్గ ప్రభ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఏఈవో ఎన్.రమేష్‌బాబు ద్వారకా తిరుమల దేవస్థానం నుంచి ఇంద్రకీలాద్రికి విచ్చేయడంతో ఆయనకు సత్రాల నిర్వహణ, దేవస్థాన భద్రత, కేశ ఖండనశాల, స్టేషనరీ, ఎంపీ ఫామ్స్, ఆర్టీఐ యాక్ట్ బాధ్యతలు అప్పగించారు. అన్నదానం, ప్రసాదాల తయారీ, శానిటేషన్, వేద పాఠశాలల బాధ్యతలు నిర్వహిస్తున్న ఏఈవో చంద్రశేఖర్ విధుల్లో మార్పులు లేవు.

ఎస్ఆర్ఆర్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సర్వేంద్రియానాం.. నయనం ప్రధానం అన్నారు. అటువంటి కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. శిబిరంలో కంటి వైద్యులు 150 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

థర్డ్ డిగ్రీ ఉపయోగించిన పోలీసులపై కేసు నమోదు చేయండి

విజయవాడరూరల్: థర్డ్ డిగ్రీ ఉపయోగించిన పోలీసులపై కేసు నమోదు చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మంద వెంకటేశ్వరరావు మాదిగ రూరల్ డిమాండ్ చేశారు. మరుసుమల్లి గ్రామస్తుడు వడ్లపూడి సంసోను మాదిగను ఇద్దరు కానిస్టేబుల్స్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ ఉపయోగించారని.. వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి, సస్పెండ్ చేయాలని కోరుతూ మంగళవారం రూరల్ మండల తహసీల్దార్ బి.సుగుణకు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో వడ్లమూటి బాబురావు, కె.కమలరాజు, డి.వీరాస్వామి, ఎల్.వాసు, దయాకర్, శ్రీనివాసరావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సెక్షన్ గాంధీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ అన్నపూర్ణ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఏరియా, ఏలూరు రోడ్డు, ప్రకాశం రోడ్డు, అలీబేగ్ వీధి, ఎన్టీఆర్ కాంప్లెక్స్, అట్లూరత్తయ్య వీధి, డీటీ రావు వీధి, గోపాల్‌రెడ్డి రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. కావున ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

దాసాంజనేయునికి ఆకుపూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు.

ఘంటసాల స్వరం అనితర సాధ్యం



విజయవాడకల్చరల్: గాయకుడు ఘంటసాల స్వరం అనితర సాధ్యమని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఘంటసాల 51వ వర్ధంతి, సినీ సంగీత విభావరి, ఘంటసాలతో అనుబంధమున్న సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావుకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమా సత్యనారాయణ మాట్లాడుతూ సంగీతమే ఊపిరిగా ఘంటసాల జీవించారని.. ఆయన స్వరం ప్రతి తెలుగు వారి ఇంట్లో వినిపిస్తోందన్నారు.

దేశభక్తి గీతాలను ఆలపించారు

సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ ఘంటసాల కేవలం సినీ గాయకుడే కాదని, విజయనగరం సంగీత కళాశాలలో శాస్త్రీయ సంగీతం అధ్యయనం చేశారని, వయోలిన్ విద్వాంసుడు ద్వారం వెంకటస్వామి నాయుడు వద్ద సంగీతంలో శిక్షణ తీసుకున్నారని పేర్కొన్నారు. స్వరాజ్య ఉద్యమ కాలంలో దేశభక్తి గీతాలను ఆలపించి యువతను కార్యోన్ముఖని చేసినట్లు తెలిపారు. పురస్కార గ్రహీత వీరభద్రరావు మాట్లాడుతూ ఘంటసాల పేరుతో సత్కారం అందుకోవడం జీవితంలో మరచిపోలేని సంఘటన అని అన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు డీవీ వీరభద్రరావు, ప్రసూనా రామన్, ప్రభల శ్రీనివాస్, కే డేవిడ్‌రాజు పాల్గొన్నారు. సంగీత రంగానికి చెందిన దావులూరి వీరభద్రరావు దంపతులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. 'ఘంటసాలకు స్వరార్చన' కార్యక్రమంలో భాగంగా కుసుమాంజలి, విష్ణుప్రియ, సుధారాణి, పీ శ్రీనివాసరావు, రసూల్ బాబు, చంద్రశేఖర్ చిత్రగీతాలను ఆలపించారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 16వ తేదీన ప్రకాశం జిల్లాలో ఆర్‌బీ డ్రాగన్ చోటా కాన్ కరాటే ఆధ్వర్యంలో జరిగిన మొదటి జాతీయ కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో పోటీల్లో సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొని, బహుమతులు సాధించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు పాఠశాల ఆవరణలో మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. వివేకానంద సెంటినరీ హైస్కూల్ హెచ్ఎం హరిత మాధవీలత, వైఎమ్‌కే అకాడమీ మాస్టర్ రూపాస్ పాల్ విజేతలను అభినందించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం హరిత మాధవీలత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, ఆత్మరక్షణకు ఉపయోగపడే విద్యల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు.